# అహం బ్రహ్మాస్మి

అద్వైతాశ్రమంలో చోరీ!

అది చోరీ కాదు. ఆశ్రమవాసులకి అగ్నిపరీక్ష.

అందర్నీ కూర్చాబెడు అధ్యక్షుడు; సత్యం చెప్పమని నొక్కి అడిగాడు.

అంతా ఎరగమన్నారు.

హృదయాలు విప్పమన్నాడు—మళ్ళీ.

హృదయాలు విప్పడమే కాదు, పెట్టెలుకూడా తెరిచి చూపారు ఆశ్రమవాసులు

పోయిన వస్తువులు దొరకలేదు.

"ఆశ్రమంలో వ్యక్తిగత ఆస్తి యేమీ వుండకూడదని ప్రతి సభ్యుడికీ తెలుసు. తెలిసికూడా శేషగిరి ఆ నియమాన్ని ఉల్లంఘించాడు. అందుచేతనే భగవంతుడీ విధంగా అతన్ని శిక్షించాడు. భగవంతుడు సర్వశక్తివంతుడు; మానవ మాత్రులకు అతని లీలలు అర్థంకావు" అన్నాడు అధ్యక్షుడు.

ఆశ్రమవాసులంతా శేషగిరినే దొంగను చూసినట్టు చూశారు.

సాయంత్రం అధ్యక్షుడు భగవంతునిలా ప్రార్థించాడు:

"సర్వేశ్వరా! నీ లీల లతివిచిత్రములు నీవే ఈ పనిని, శేషగిరికి జ్ఞానోపదేశమునకై చేసివుంటావు. నీవే ఆ సొమ్ము మరల నాకు చేర్చు. శేషగిరి అజ్ఞాని అతని కింకా ధన వ్యామోహం వదలలేదు. అతన్ని క్షమించు."

శేషగిరి తన అజ్ఞానాన్ని ఒప్పుకొని, క్షమించమని భగవంతుడ్ని ప్రార్థించాడు.

మర్నాడు అధ్యక్షుడు మామూలుగా ఉదయపు నడకకు వెళ్ళివచ్చే వరకు ఆశ్రమంలో పోలీసులున్నారు. పోయిన వస్తువులు అధ్యక్షుడు పెట్టెలోనే దొరికినై. అధ్యక్షుడికి ఆశ్చర్యంకంటె ఆనందం ఎక్కువ కలిగింది.

"భగవంతుడు భక్తలోలుడు. నేను కోరిన విధంగా నా వస్తువులు నాకు వప్పగించాడు" అన్నాడు.

"స్వామివారు చెప్పిందంతా జరిగింది.




భగవంతుడిమాయ మాబోటిమూఢులకేం అర్థమౌతుంది" అన్నాడు శేషగిరి.

భగవంతుడి మాయ తెలుసుకొని పోలీసులు, శేషగిరి వస్తువులు శేషగిరికి వప్పగించి వెళ్ళిపోయారు.

"ఈ ఘటన మీ బోటి అధ్యాత్మిక విద్యార్థుల కొక కఠినప్రశ్న. ఇప్పుడు భగవంతుడు యే రూపముతో రక్షకభటుల దగ్గరికిపోయి వుంటాడో మీరు చెప్పగలరా?" అన్నాడు అధ్యక్షుడు.

ఆశ్రమవాసులకు భగవంతుడి రూపం అంతుబట్టలేదు. అంతా శేషగిరివంక చూశారు.

"అంతకంటె కఠినమైన ప్రశ్న యింకొకటి వుంది. భగవంతుడు యే రూపంలో దొంగతనం చేసివుంటాడని మీ నమ్మకం?" అన్నాడు శేషగిరి.

ఆశ్రమవాసులకి యిది కూడా అంతుపట్టలేదు. అధ్యక్షుడి వంక చూశారు.

"కామరూపంలో భగవంతుడు ఒకరి శరీరాన్ని ఆశ్రయించ నక్కర్లేదు" అన్నాడు అధ్యక్షుడు.

"బహుశా అదేరూపంతో పోలీసులకి కూడా రిపోర్టు చేసివుంటాడు" అన్నాడు శేషగిరి.

అధ్యక్షుడు నొచ్చుకున్నాడు.

"సర్వేశ్వరా! నీ లీల లతివిచిత్రములు. నేనెంత అజ్ఞానినో నువ్వు శేషగిరి రూపంతో రుజువుపర్చావు. శేషగిరి ఆధ్యాత్మికవిద్యలో నాకంటె గొప్ప. అతను నా దగ్గర నేర్చుకునేది యింకేమీ లేదు" అని ప్రార్థించాడు అధ్యక్షుడు.

"సర్వేశ్వరా! నీ అవ్యాజ కృపవల్ల నేను వారంరోజులకే గురువుగార్ని మించిపోయాను. ఐనా నా జీవితమంతా వారినే గురువుగా ఎంచుకుంటాను. దయానిధీ! నీవు నాలోనేకాదు. గురువుగారిలోగూడా విరాజిల్లుతున్నావు" అని ప్రార్థించాడు శేషగిరి

అదే శేషగిరి ఆఖరి ప్రార్థన.

ఆనాటి సాయంత్రమే ఆశ్రమం వదలిపెట్టాడు శేషగిరి - గురువుగారి శెలవూ, దీవెనయూ పొంది.

---